


నేడు ఉచిత డిఎస్‌సి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

డిఎస్‌సి కోచింగ్‌ను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం పార్వతీపురంలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వం ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన మేరకు గిరిజన విద్యార్థులకు ప్రస్తుతం ఉచిత కోచింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ ఉచిత కోచింగ్‌లో ఉచిత వసతి భోజన సౌకర్యాలను ఐటిడిఎ ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఐటిడిఎ పిఒలు, పలువురు అధికారులు పాల్గొనున్నారు.

అవుట్‌సోర్సింగ్ టీచర్లపై 'సమ్మె'ట దెబ్బ

- గురుకుల పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- గిరిజన ఆశ్రమ పాఠశాలల టీచర్లతో నిర్వహణ
- ఐటిడిఎ అధికారులకు ఆదేశాలు
- పోరాటం తీవ్రతరం చేస్తామంటున్న ఉపాధ్యాయులు



బిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులపై సమ్మెట దెబ్బకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈనెల 15నుంచి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమ్మెలో ఉన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట దీక్షలు చేపడుతున్నారు. డిఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని, సి ఆర్టీలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా పోరాడుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులకు తమ సమస్యలను వివరిస్తూ ఆందోళన సాగిస్తున్నారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు టిజిటిలకు రూ.12,900, పిజిటిలకు రూ.14,800, జూనియర్ అధ్యాపకులకు రూ.16,100 వేతనాలు ఇస్తున్నారు. అయితే వీరికిచ్చే జీతం గురుకులాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది కంటే తక్కువ. అరకొర వేతనాలతో 15 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న వీరికి ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీ ఉరితాడులా పరిణమించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 191 గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీల్లో 1630 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరిలో 80శాతానికి పైగా గిరిజనులే ఉన్నారు. డిఎస్సీ నుంచి వీరిని మినహాయించకపోతే వారి భవిష్యత్తు అంధకారమవుతుంది. వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే తమ ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గత 15రోజులుగా పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి ఏ విధమైన భరోసా కనిపించడంలేదు. మరో పక్క గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. మరో నాలుగు నెలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె ప్రభావం పది, ఇంటర్ ఫలితాలపై పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించకుండా కిరాతక చర్యలకు దిగుతోంది. గురుకుల పాఠశాలలో, కళాశాలల్లో విద్యాబోధన దెబ్బ తినకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఐటిడిఎ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గురుకుల పాఠశాలల్లో కళాశాలలకు పంపించి బోధన చేయించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల కు నష్టం రాదా?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బోధన చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వల్ల ప్రయోజనం ఏమీ వుండదని ఉపాధ్యాయ, గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు తాజా ఉత్తర్వుల వల్ల నష్టం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల అటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోనూ, ఇటు గురుకుల పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుందని వాదిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మెను నీరుగార్చే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. శాంతియుతంగా పోరాడుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెచ్చగొట్టేలా ఉత్తర్వులు జారీ చేసిందని ఆవేదన చెందుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఈ ఉద్యోగం తప్ప మరో ఆధారం లేదు. ఇదే ఆధారమనుకొని బతుకుతున్నాం. డిఎస్‌సి నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నాం. నాన్ టీచింగ్ సిబ్బంది కంటే తక్కువ వేతనాలతో పని చేస్తున్నాం. రాష్ట్రంలోని 191 గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ బోధనా సిబ్బందిలో 80 శాతం మంది గిరిజనులే. ఇప్పుడు డిఎస్సీకి ఫ్రెష్ బ్యాచ్ విద్యార్థులతో పోటీ పడి ఉద్యోగాలు సాధించడం చాలా కష్టం. ప్రభుత్వం మానవతా దృష్టితో మా సమస్యలు పరిష్కరించాలి.

శోభారాణి,
అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు.

డిఎస్‌సి మినహాయించకపోతే బతుకులు రోడ్డు పాలే



రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల్లో 80 శాతానికి పైగా గిరిజనులే ఉన్నారు. గత 15 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు పైగా ఈ ఉద్యోగాలే జీవనాధారమని నమ్ముకుని పని చేస్తున్నాం. ఇప్పుడు డిఎస్‌సి నుంచి మినహాయించకుంటే మా బతుకులు రోడ్డు పాలే. మరో మార్గం లేదు. భార్య, పిల్లలతో చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాం. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు డిమాండ్లు ఆమోదించాలి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో గురుకుల పాఠశాలలు, కళాశాలలను నడపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గం.

నిమ్మక దివాకర్,
అధ్యక్షుడు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం..



నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

పార్వతీపురంలో ర్యాలీ, కాంప్లెక్స్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

కూటమి ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఆపాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంపుదలను ఖండిస్తూ ఆదివారం స్థానిక సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నర్సింగరావు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (లిబరేషన్) నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.రంజిత్ కుమార్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయంలో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాలను అప్పటి ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు వ్యతిరేకించారని, నేడు అధికారానికి వచ్చిన ఆరు మాసల్లోనే అదే విద్యుత్తు చట్టాన్ని అమలు చేయడం దుర్మార్గమని, ఈ చర్య రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేకూర్చడమేనని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే టిడిపి, జనసేన, బిజెపి కూటమి విద్యుత్ భారాలను శర వేగంగా రాష్ట్ర ప్రజలపై మోపుతున్నాయని, ఇది కేవలం కార్పొరేట్ విధానాలను పెంచి పోషించడమేనని తెలిపారు. అదానీ అక్రమాలను ప్రపంచానికి వెలుగు చాటినప్పటి నుంచి మన రాష్ట్రంలో బాబు, జగన్, పవన్ కవచంలా నిలిచారని, ఇది రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహాన్ని తలపెట్టినట్లేనని విమర్శించారు. కావున వెంటనే రూ.17 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని, పెంచిన ట్రూ ఆఫ్ విధానాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, టిడిపి కూటమి ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయాలని, కేంద్రం విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ, వృత్తి దారులందరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సెకీతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, ఆర్థిక నేరానికి పాల్పడిన అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.అవినాష్, వై.మన్మథరావు వి.ఇందిరా, కె.గంగునాయుడు, పట్టణ కార్యదర్శి గొర్లి.వెంకటరమణ, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమా, డి.రమణారావు, గిరిజన సంఘం నాయకులు మర్రి శ్రీను, మండంగి శ్రీను, కె.ఈశ్వరరావు, కె.రామ స్వామి, డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.వెంకటరమణ, కె.రాజు, పి.రాజశేఖర్, ఐద్వా నాయకులు జి.తులసి, ఎం.గౌరి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం... అన్నదాత కళ్లల్లో దైన్యం

- కొంపముంచిన 'ఫెంగల్'
- కోసిన చేలను కాపాడుకొనే పనుల్లో రైతులు బిజీ
- రంగుమారిన ధాన్యంకొనుగోళ్లపై అనుమానాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అన్నదాత గుండెల్లో గుబులు పుట్టించిన అకాల తుఫాన్ అనుకున్నట్లుగానే వారి కళ్లలో దైన్యం నింపింది. వరి కోతలు, నూర్పులు పూర్తి కాకుండానే ఫెంగల్ తుపాను ప్రభావం కారణంగా కురిసిన వర్షాలకు రైతు వెన్ను వణుకుతోంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేదా అని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలకు అక్కడక్కడా వరి పంట దెబ్బ తినే పరిస్థితి కనిపిస్తోంది. సాలూరు మండలం మామిడిపల్లి పంచాయతీ పిట్టాడవలసలో వరి చేలు నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు పడడంతో వరి పంట నీటి పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని గ్రామాల్లో వరి నూర్పిడి పనులు పూర్తి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న సమయంలో వర్షాలు పడడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. టార్పాలిన్‌లతో కప్పి ఉంచుతున్నారు. ధాన్యం కొనుగోలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న సమయంలో అకాల వర్షాలు అన్నదాతల గుండెల్లో గుబులు రేపుతున్నాయి.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తారా?

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వర్షాలు పడడంతో వరి పంట నేలకొరగడం రైతుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. మరికొన్ని గ్రామాల్లో రైతులు తుఫాన్‌కు భయపడి పొలాల్లోనే వరి చేను దిబ్బలు వేసుకున్నారు. అయితే తడిసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంటారా? నాణ్యత సాకుతో మద్దతు ధరలో కోత పెడతారా అన్నది తేలాల్సి ఉంది. అకాల వర్షాలు అన్నదాతల వెన్నులో వణుకు పుట్టించాయి.

కురుపాం : ఇన్నాళ్లు సాగునీటి కోసం వర్షం కోసం ఆకాశానికి ఎదురుచూసిన రైతన్నలు ఇప్పుడు పంట చేతికి వచ్చే దశలో చిరుజల్లులు పడుతుండడంతో గుబులు చెందుతున్నారు. తుపాన్ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆకాశం మేఘావృతమై వీడకుండా వర్షపు జల్లులు కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరి, రాగులు, సాములతో పాటు వాణిజ్య పంటలు కోతలు, నూర్పులు ముమ్మరంగా జరుగుతూ పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం పడుతుండడంతో దిగులు చెందుతున్నారు. భయంతో కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పలు గ్రామాల్లో ముమ్మరంగా కోతలు కోసిన వరి పనలు పొలంలోనే తడిసి ముద్దయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో కోసిన వరి తడి అరకుండానే పొలం వద్ద కుప్పలుగా వేసి, వాటిపై టార్పాలిన్లు కప్పగా, కళ్లాల్లో నూర్చిన ధాన్యం సంరక్షించే పనుల్లో నిమగ్నమై రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. చేతికి అందిన పంటలు పోగొట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పలుచోట్ల కోసిన పంటలు తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కురుపాంతో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న ముసురు వాతావరణం పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులకు గుండెల్లో దడ పుట్టిస్తోంది.



సాలూరులో నేలకొరిగిన వరి పంట

కొమరాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న చిరుజల్లులతో అన్నదాతకు తీవ్ర నష్టం జరుగుతుంది. తుపాను ప్రభావం తమ ప్రాంతానికి అంతగా ఉండదనే ఉద్దేశంతో చేతికి అందించిన పంట వరి కోతలు కోయకపోతే ధాన్యం రాలిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అర్తాం, కల్లికోట, గంగిరేగువలస, కొమరాడ, దేవుకోన, కూనేరు తదితర ప్రాంతాల్లో వరి కోత కోసేందుకు గత వారం రోజులుగా సిద్ధంగా ఉన్నప్పటికీ తుపాను ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు కోతలు నిలిపివేశారు. మరికొన్ని ప్రాంతాల్లో కోతలకు వ్యవసాయ కార్మికులు దొరక్క పొలాల్లోనే చేలు ఉండడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లు వల్ల తడిసే పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు ఎంత కష్టపడినా ఫలితం దక్కడం లేదు. దీంతో ఇప్పటికే కోసిన వరిసేను పూర్తిగా వర్షానికి తడిసిపోయి నష్టం జరగడంతో రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిపోయిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కురుపాంలో ధాన్యం తడిసిపోకుండా రాసులపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల అసమానతలు తొలగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో ఉండే అసమానతలు తొలగాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు పేర్కొన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఎయిడ్స్ బారిన పడిన వ్యక్తులకు సహాయక వాతావరణాన్ని పెంపొందించాలని ఆయన సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసి కాంప్లెక్స్ మీదుగా తిరిగి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఒక్కో ఏడాది ఒక్కో నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది హక్కుల మార్గాన్ని తీసుకోండి నినాదంతో వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మానవ హక్కులను సమర్థించడం, ప్రాముఖ్యతను తెలియజేయడం దీని ముఖ్యోద్దేశ్యమన్నారు. ఇది ప్రజల హక్కులను ఉల్లంఘించే చట్టపరమైన, సామాజిక అడ్డంకులను తొలగిస్తుందని పేర్కొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

ర్యాలీలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, ఇతర వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎన్ఎస్ఎస్ ఆర్ఆర్‌సి వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రూ.622 కోట్లతో వాటర్ గ్రిడ్‌కు ప్రతిపాదనలు

జెజెఎంలో 25 శాతం ఇళ్లకు తాగునీరు

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ ఒ.ప్రభాకరరావుతో ముఖాముఖి

జిల్లాలో రూ.622 కోట్లతో తొమ్మిది లక్షల మందికి తాగునీరు సరఫరా చేసే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు చెప్పారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.494కోట్లు అంచనాతో 2256 గ్రామాలకు తాగునీరందించనున్నామని తెలిపారు. అలాగే జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఇంకా జిల్లాలో తమ శాఖ ద్వారా అమలవుతున్న పనుల ప్రగతి గురించి ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

-ప్రజాశక్తి, పార్వతీపురం





జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో ఇంతవరకు ఎన్ని ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు?

జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా 2256 గ్రామాలకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి. రూ.494 కోట్ల అంచనాతో 2859 పనులు చేపట్టాలి. రెండు లక్షల ఇళ్లకు తాగునీటి సరఫరా చేయాలన్నదే లక్ష్యం. అయితే ఇంతవరకు 635 పనులు పూర్త య్యాయి. మరో 655 పనులు పురోగతిలో ఉన్నాయి. 53,167 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. 25 శాతం పనులు రూ.40 కోట్లతో పూర్తయ్యాయి. ఇంకా 1200 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ప్రభుత్వం అనుమతి రాగానే మిగిలిన పనులు ప్రారంభిస్తాం.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ఉద్దేశం ఏమిటి?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు రూపకల్పనకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని ఆదేశాలు అందాయి. బోర్ల ద్వారా తాగునీటి సరఫరా వల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని భావించి చెరువులు, జలాశయాలు, సాగునీటి కాలువల నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రతిపాదనలు ఏమిటి?

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు రూపకల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కురుపాం నియోజకవర్గంలోని 3 3 2 గ్రామాల్లో 2.57లక్షల జనాభాకు తాగునీటి సరఫరాకు సంబంధించిన గ్రిడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పార్వతీపురం నియోజకవర్గంలోని 215 గ్రామాల్లో 1.92 లక్షల జనాభాకు, పాలకొండ నియోజకవర్గంలో 691 గ్రామాల్లో 2.39లక్షల జనాభాకు, సాలూరు నియోజకవర్గంలో 619 గ్రామాల్లో 2.11లక్షల జనాభాకు తాగునీగు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. తోటపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలకు తోటపల్లి జలాశయం నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు తయారు చేశాం. సాలూరు నియోజకవర్గానికి చెందిన మూడు మండలాల్లో గ్రామాలకు విఆర్ఎస్ జలాశయం నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు తయారు చేశాం. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం ఈ నెలాఖరులోగా లభించే అవకాశం ఉంది .

ఇతర పనులు ఏం జరుగుతున్నాయి?

గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా జిల్లాలోని 459 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు చేపడుతున్నాం. రూ.37వేలతో మరుగుదొడ్డి, రూ.15వేలతో తాగునీటి సరఫరా చేసే పనులు చేపట్టాలి. నిధులు చాలకపోతే గ్రామపంచాయతీ నిధుల నుంచి కొంత డబ్బు సమకూర్చుకోవాలి. మొత్తం 520 పనులకు 300 పనులు పురోగతిలో ఉన్నాయి. డిసెంబర్ నెలాఖరుకు ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో సిపిడబ్ల్యు స్కీం లెన్ని?

జిల్లాలో 288 గ్రామాలకు తాగునీటి సరఫరాకు సంబంధించిన 11 సిపిడబ్ల్యు స్కీంలు పని చేస్తున్నాయి. జెడ్పీ నిధులతో ఈ పథకాల నిర్వహణ పనులు జరుగుతున్నాయి .

8న ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష


ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, శాప్, క్రీడా భారతి సంస్థ సంయుక్తంగా ఈనెల 8న నాల్గొవ క్రీడా జ్ఞాన పరీక్ష (ఆన్లైన్)నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. పరీక్షను http://kreedabharathi.org లింక్‌లో నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలో గెలుపొందిన విజేతలకు నగదు, అవార్డు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రథమ అవార్డు విజేతకు రూ. లక్ష ఒకరికి, ద్వితీయ విజేతలకు రూ.50వేలు చొప్పున ఇద్దరికి, తృతీయ విజేతలకు రూ.25 వేలు చొప్పున ఆరుగురికి, అవార్డు విజేతకు రూ.11 వేలు చొప్పున 11 మందికి నగదు బహుమతిని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈపరీక్ష ఉదయం 5.00 గం.ల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు లాగిన్ ఆన్‌లో ఉంటుందన్నారు. 12 ఏళ్లు ఆ పైబడిన వయస్సు వారంతా పరీక్షకు హాజరుకావచ్చని చెప్పారు. ఆసక్తి గల జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు, పౌరులు ఆన్లైన్ క్రీడా జ్ఞాన పరీక్షకు http://kreedabharathi.org లింక్‌లో రిజిస్టర్ కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కమిషనర్ జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మున్సిపల్ పరిధిలో గల ప్రజలు తమ వార్డుల్లోని సమస్యలపై అర్జీలు అందజేయాలని సూచించారు.



రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

రైతులను ఆదుకునే రైతు పక్షపాతిగా ఉన్నది కూటమి ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మొండెంఖల్ రైతు సేవా కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి కేవలం 48 గంటల్లో అకౌంట్లో జమ చేయడం ఇంతవరకు ఎప్పుడూ జరగలేదన్నారు. అనంతరం రైతులు ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రైతు ఆరుగాలం కష్టపడి పండించి వేలకు వేల రూపాయలు మదుపులు పెట్టి పంట చేతికి వచ్చేసరికి దళారులను నమ్మి మోసపోయే పరిస్థితి ఉండని, కావున ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి డబ్బులు కూడా 48 గంటల్లోపు రైతు అకౌంట్‌లోకి జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, టిడిపి నాయకులు హెచ్. సుబ్బలక్ష్మి, బి.యువరాజు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

నేడు, రేపు గ్రామ, మండల కేంద్రాల్లో ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ ఉత్తుత్తి ప్రకటనలకు పరిమితం కాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సోమ, మంగళవారాల్లో గ్రామ, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎపి రైతుసంఘం, కౌలు రైతుల సంఘం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ధాన్యం కొనుగోలులో ఎక్కడా రాజీ పడేదిలేదని, ప్రతి ధాన్యం గింజ కొంటామని, తేమ శాతం 25 ఉన్నా ధాన్యం కొంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటనలకే పరిమితం తప్ప ఆచరణలో కానరావడంలేదని, తుఫాన్ ప్రభావంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేక అమ్మేయడం సిద్ధపడితే తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉందని కొనుగోలు కేంద్రాల దగ్గర ప్రభుత్వ సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాయకులు తెలిపారు. రైతులకు అవసరమైనన్ని గోనెసంచులు అందుబాటులో ఉండటం లేదని, రవాణాలో ఇబ్బందులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా ఇబ్బందులు దాటుకొని మిల్లుల దగ్గరకు చేరిన వాహనాలు అన్‌లోడింగ్ కావడం లేదన్నారు. అన్‌లోడింగ్ కోసం రైతులు మిల్లుల దగ్గర 2, 3 రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోందని, దీంతో తక్కువ ధరకే ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమ, మంగళవారాల్లో గ్రామ, మండల కేంద్రాల్లో సమస్య ఉన్న అన్ని చోట్ల రైతులు, కౌలు రైతులు ముందుకొచ్చి ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



అడలి వ్యూ పాయింట్ వద్ద సందడి చేస్తున్న యువత

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సండే సందడి చేశారు. జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశీర్వదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి సాహసం చేశారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఆడలి యు పాయింట్ సందర్శించి పర్యాటకులు అందాలను కనవిందు చేసుకున్నారు.



శిథిలావస్థకు చేరిన గుమ్మలక్ష్మీపురం పశువైద్యశాల

శిథిలావస్థలో పశు వైద్యశాల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక పశువైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలని పాడి రైతులు కోరుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పశువైద్యాధికారి బదిలీపై గౌరడ వెళ్లడం ఆ పోస్ట్ గత ఆరు నెలలుగా భర్తీకి నోచుకోలేదు. దీంతో ఈ ప్రాంతంలో పశువులకు మెరుగైన సేవలందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలమవ్వడంతో వర్షానికి నీరు పూర్తిగా లోపలకు చొరబడి విధులకు ఆటంకంగా మారుతుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తలుపులు, కిటికీలు చెదలు పట్టి పూర్తిగా పాడయ్యాయి. కొత్తగా పశువైద్యశాల భవనం నిర్మించినా నేటికీ ప్రభుత్వం దాని ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం శిథిలమైన భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు గుర్తించి నూతన భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ పశువైద్యాధికారి నిర్మించాలని కోరుతున్నారు.

ఏకగ్రీవంగా వార్షిక అంచనా బడ్జెట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం 2025- 26 వార్షిక అంచనా బడ్జెట్‌ను ఎంపిపి బొంగు సురేష్, వైస్ ఎంపిపి సంపత్ కుమార్, ఎం పి టి సి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.రమేష్ అధ్యక్షతన ఎఒ కె.రామారావు బడ్జెట్ను చదివి వినిపించారు. ఇందులో ఖర్చు 110. కోట్లు చూపగా 2,54,917 రూపాయలు అంత్య నిల్వగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో బడ్జెట్ను ఖరారు చేసినట్లు ఎంపీడీవో ప్రకటించారు.

ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం- పాలకొండ ప్రధాన రహదారి మరమ్మతు పనులు ఎట్టకేలకు చేపడుతున్నారు. గుంతలుగా ఉన్న ఈ ప్రాంతమంతా జెసిబి ద్వారా తవ్వకాలు జరుపుతున్నారు. గత ఐదేళ్లుగా ఈ రహదారి మరమ్మతులు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఈ రహదారి మరమ్మతులు చేపట్టడంతో కొంత మేర ఇబ్బందులు తప్పేయని వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



చురుగ్గా సాగుతున్న వీరఘట్టం-పాలకొండ రహదారి పనులు

వణికిస్తున్న వైరల్ ఫీవర్లు

ఇంటింటా జ్వరపీడితులే

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలో గత కొద్దిరోజుల నుంచి వాతావరణంలో మార్పుల వల్ల మండలంలోని చాలా గ్రామాల్లో చిన్న, పెద్ద అని తేడా లేకుండా వైరల్ ఫీవర్ వణికిస్తోంది. వాతావరణంలో మార్పుల వల్లే జ్వరాలు వెంటాడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మండలంలో రోజు రోజుకు వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి జ్వరాలు కూడా అధికమవుతున్నాయి. మండలంలోని మొండెంఖల్‌లో ప్రతి ఇంట్లో ఒకరిద్దరయినా ఒళ్లంతా నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారు. వైరల్ ఫీవర్‌తో ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రయివేట్ ఆస్పత్రులు రద్దీగా మారుతున్నాయి. కొందరు ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యాలు రకరకాల పరీక్షల పేరుతో ప్రజల దగ్గర ఫీజులు దండుకుంటున్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపిలు, ప్రయివేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

మొండెంఖల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా ప్రజలకు ఆరోగ్య సేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది వ్యాధులపై కనీసం అవగాహన కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల సర్వే చేసి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న రోగులు

శాంపిల్స్‌ను జిల్లా ఆసుపత్రికి పంపించాం

మొండెంఖల్‌లో జ్వరాలు కొంతమేరకు ఉండడం వాస్తవమే. చికెన్ గున్యా ఏమైనన్న అనుమానంతో పలువురి దగ్గర బ్లడ్ శాంపిల్ తీసి జిల్లా ఆసుపత్రికి పంపించాం. ప్రస్తుతం వారికి వైద్యం అందిస్తున్నాం. ఈ గ్రామంలో ఎక్కువ మంది ఆర్‌ఎంపి వైద్యులను నమ్ముతున్నారు. ఎంతగా అవగాహన కల్పించినా వినకుండా ఆర్‌ఎంపి వైద్యులను నమ్మి వేలకు వేలు రూపాయలు ఖర్చు చేస్తూ ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. పిహెచ్‌సికి వచ్చిన రోగులకు వైద్యం బాగానే అందిస్తున్నాం. బెడ్లు కూడా వారికి సరిపడినన్ని ఉన్నాయి.

డాక్టర్ వెంకట్ హర్ష,
మొండెంఖల్ పిహెచ్ వైద్యాధికారి

బెల్ట్ బేజారు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మండలంలో ఆరు మద్యం దుకాణాలుండగా, గతంలో కంటే బెల్ట్ షాప్‌లు విపరీతంగా పెరిగాయి. వీధికొక బెల్ట్ షాపు ఉండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో కూడా బెల్ట్ షాప్‌లు వెలసి మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా జరుగుతున్న ఈ మద్యం విక్రయాల వల్ల గ్రామాల్లో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజుపేట, కోటిపల్లి, బాసూరు, బడ్డుమాసంగి తదితర గ్రామాల్లో బెల్ట్ షాప్‌ల ద్వారా జోరుగా మద్యం విక్రయం జరుగుతుందని తెలుస్తోంది. అలాగే పట్టణంలో అన్నా కాంటీన్ దగ్గర, అలాగే కోటదుర్గమ్మ గుడికి చుట్టుపక్కల, గొల్లవీధి సెంటర్‌లో, ఎన్ కే రాజపురం సెంటర్ దగ్గర విచ్చలవిడిగా బెల్ట్ షాప్‌ల ద్వారా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. కోడి కూయకముందే తెరిచే ఈ బెల్ట్ షాప్‌ల్లో అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎంఆర్‌పి కంటే బాటిల్‌పై అదనంగా రూ.40 నుండి రూ.60 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని మందుబాబులే చెప్తున్నారు. అలాగే పట్టణ శివారు గల వీరఘట్టం రోడ్‌లో వెలసిన లైసెన్స్ మద్యం దుకాణం పక్కన ఎటువంటి పర్మిట్ రూమ్ లేనప్పటికీ చుట్టు పక్కల యాత్ర మాదిరిగా వెలసిన దుకాణాలు వెనకాల మందుబాబులు నిత్యం మద్యం సేవించి హంగామా చేస్తున్నారు. గుడి, బడి అన్న తేడా లేకుండా వెలిసిన ఈ బెల్ట్ షాప్‌ల్లో ఇంత బాగోతం నడుస్తున్నా అధికారులు ఇవేమీ పట్టనట్లు వ్యవహరించటం కొసమెరుపు.

ఈ విషయమై 'ప్రజాశక్తి' ఎక్సైజ్ సిఐ సూర్యకుమారి వివరణ కోసం స్టేషన్‌కు వెళ్లిగా ఆమె అందుబాటులో లేరు. అలాగే ఫోన్‌లో వివరణ కోసం ప్రయత్నం చేసినప్పటికీ ఆమె అందుబాటులో లేరు. దీంతో ఎక్సైజ్ ఎస్ఐ తిరుపతిరావును కలిసి వివరణ కోరగా తానేమీ మాట్లాడకూడదని, దీనిపై స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాత్రమే సమాధానం చెప్పాలని అన్నారు.

'బాబు ష్యూరిటీ... బాదుడు గ్యారెంటీ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బాబు షూరిటీ బాదుడు గ్యారెంటీ అన్న నినాదంతో పాలన సాగుతుందని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి ఎద్దేవా చేశారు. జియమ్మవలస మండలం చినమేరంగి కోటలో ఆదివారం ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనగా ఆమె స్పందిస్తూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్నో సందర్భాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అన్న నినాదంతో ఎన్నికలకు వచ్చి ఎన్నో అమలు కానీ హామీలు ఇచ్చారని, నేడు వాటిని నెరవేర్చడం లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, రైతులకు ఉచితంగా 9 గంటల కరెంటు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు మాట తప్పరని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో రూ.9,412 కోట్లు విద్యుత్ భారం ప్రజలపై పడుతుందన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.2.19 పైసలు పెంచారని ఇచ్చిన మాట చంద్రబాబు తప్పారని ప్రజలను మోసగించడమే పనిగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు అదే బాదుడు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ఒకటి కూడా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం మాట మరిచారని, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత పథకం అమలు కాలేదని, స్త్రీ శక్తి పథకంతో మహిళలకు అండగా ఉంటానని చెప్పిన ఆరు నెలలు గడిచిన ఒక్క పథకం కూడా అమలు చేయలేదని అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అవినీతి లేకుండా ప్రజలకు నేరుగా రూ.2లక్షల 72 వేల కోట్లు డిబిటి ఖాతాల ద్వారా వేశారని అన్నారు. చంద్రబాబు మారారని ప్రజలకు మంచి చేస్తారని నమ్మి ఓటు వేస్తే నెట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



మంటకాగుతున్న గిరిజనులు

మన్యంలో చలి పులి

రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

వృద్ధులకు, పిల్లలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో చలి తీవ్రంగా ఉంది. ఎక్కువగా పొగమంచు కమ్మేసి చలి వేస్తుంది. గత వారం రోజులుగా చలి అధికంగా ఉండడంతో ఉదయం 8 గంటల వరకు సూర్యుడు కనిపించడం లేదు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలి ప్రారంభమై, త్వరగా పొద్దుపోతుంది. చలి ఎక్కువగా వేయడంతో పిల్లలు, వృద్ధులు ఎక్కువగా బాధపడుతున్నారు. వణికిస్తున్న చలి పులిగా మారుతుంది. ఎముకలు కొరికేసిన చలితో చేతులు తిమ్మిర్లు ఐస్ గడ్డల్లా రక్తం గడ్డ కట్టడంతో తట్టుకోలేకపోతున్నారు. ఉదయం నుండే పొగ మంచు కనిపించడంతో ఒకరి ముఖం ఒకరు కనిపించడం లేదు. మరోపక్క స్వెటర్లు, రగ్గులు, నూలు వస్త్రాలు ధరించినప్పటికీ చలి తట్టుకోలేకపోతున్నారు. చల్లని చలి గాలితో గజగజలాడుతున్నారు. మంటలు కాగినప్పటికీ కాగినంతచేపే బాగుంటుంది. ఆ తర్వాత మంచంపై నిద్రించే సమయంలో చలికి బట్టలు చల్లగా అయిపోయి నిద్ర పట్టక జాగారం చేస్తున్నారు. ఇక అత్యవసర సమయంలో ఉదయం, సాయంత్రం వెళ్లేసరికి మంచు దుప్పటి మన చుట్టూ కమ్మేస్తుంది. పొగ మంచు రోడ్డు చుట్టూ మన ముందు కమ్మేస్తుంది. దీంతో ఒకరి మొఖం ఒకరికి కనిపించకపోవడంతో ప్రమాదాలు కూడా జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే పోలీసులు సూర్యుడు ఉదయించే వరకు వెళ్లరాదని సూచనలు సలహాలు ఇస్తున్నారు.

ఈ చలికి స్వెటర్లు, మంకీ టోపీలు, రగ్గులు ధరించినప్పటికీ చలిగాలిలో తిరగడం వల్ల పిల్లలకు వృద్ధులకు శీతాకాలం వ్యాధులు కూడా జలుబు దగ్గు జ్వరం వంటివి వస్తున్నాయి. అయితే వైద్యులు అత్యవసర సమయమైతే తప్ప బయటకు రావద్దని ఇప్పటికే సూచనలు సలహాలు ఇస్తున్నారు.

ఎలా జరిగింది?

భోగాపురం : మండలంలోని పోలిపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంపై అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించారు. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణిబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్ మల్లికార్జునరావు, భోగాపురం సిఐ ప్రభాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం ఏ విధంగా జరిగిందో కారణాలపై విశ్లేషించారు. కారు అతివేగంగా నడపడం వల్ల డివైడర్‌ను ఢీ కొట్టిన వెంటనే టైర్లు పేలిపోయినట్లు భావిస్తున్నారు.



పాలకొండలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కొమరాడ

కురుపాంలో ఈనెల 10, 11 తేదీల్లో జరగనున్న సిపిఎం 10వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కొమరాడలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రతిరోజూ సిపిఎం పోరాడుతుందన్నారు. ఈపోరాటల్లో భాగంగానే మండలంలోని గుమ్మడ రైల్వే స్టేషన్‌లో హాల్ట్‌ను పునరుద్ధరించుకున్నామని, రోడ్డు మరమ్మతు పనులు కూడా చేయించుకుంటున్నామని తెలిపారు. గిరిజన గ్రామాలో తాగునీరు, ఉపాధిహామీ బిల్లులు, ఏనుగుల సమస్య పైనా, పూర్ణపాడు -లాబేసు వంతెనపైనా, తోటపల్లి, జంఝావతి రిజర్వాయర్, గుమ్మడిగెడ్డ రిజర్వాయర్ వంటి నీటి వనరుల కోసం దీర్ఘకాలంగా నిలకడగా పోరాడుతున్నది సిపిఎంయేనని అన్నారు. మండలంలో సమస్యలతో పాటు జిల్లాలో గల అనేక సమస్యలపైన పోరాటాలు జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టేందుకు ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నామని తెలిపారు. కావున ఈ మహాసభలకు ప్రజలు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాలకొండ : ఈనెల 10,11 తేదీల్లో కురుపాంలో సిపిఎం 10వ జిల్లా మహాసభలు జరగనున్నాయని, ప్రజలంతా ఈ మహాసభలో పాల్గొనాలని, అలాగే ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు జిల్లా మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో దీర్ఘకాల సమస్యలపైన నిలకడగా పోరాడుతున్న పార్టీ సిపిఎం అని అన్నారు. రాబోయే కాలంలో జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంతో ఆందోళన, పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు. అలాగే మండలంలో సమస్యలతో పాటు జిల్లాలో గల అనేక సమస్యలపై పోరాటాలు జరుగుతున్న నేపథ్యంలో ఇంకా ఉద్యమాలు, పోరాటాలు సమీక్షించుకొని జిల్లా వ్యాప్త సమస్యల పరిష్కారానికై ఏకం కావాలని, ఈ మహాసభలకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అర్త మూడి లక్ష్మణరావు, కాద రాము, దూసి దుర్గారావు, ఎ.భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్.వెంకంపేట బల్క్‌కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

నేడు విశాఖ డెయిరీ కార్యాలయం వద్ద మహాధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖ డెయిరీ పరిధిలో పాల సేకరణ ధర తగ్గించిన డెయిరీ యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా సోమవారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద (గాజువాకలో) జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పాడి రైతుల సంఘం అధ్యక్షులు రెడ్డి రమణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్.వెంకంపేటలో మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా ఉన్న విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధరను లీటర్ రూ.35 నుంచి రూ.32కు తగ్గించిందన్నారు. ఈ నిర్ణయం వల్ల విశాఖ డెయిరీ పరిధిలో గల శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన సుమారు 3 లక్షల 50 వేల మంది పాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసలే పశు పోషణ భారంగా మారిందని, పశువుల దాణా, పోషణకు అవసరమైన ఇతర ఖర్చులు పెరిగాయని అన్నారు. దీంతో పాల రైతులకు గిట్టుబాటు గాక క్రమంగా పశుపోషణ నుంచి ఇతర వృత్తులకు మరలుతున్నారన్నారు. ఈ స్థితిలో విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధరను తగ్గించి రైతులకు నష్టం కలిగించేందుకు పూనుకుందన్నారు. యాజమాన్యం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ డెయిరీ పరిధిలో గల అన్ని జిల్లాల్లోని పాల రైతులు ఆందోళనలు, నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. వాస్తవంగా పశు పోషణ ఖర్చు పెరిగిన నేపథ్యంలో ఆవుపాల ధరను కనీసం రూ.50కు పెంచి అమలు చేయాల్సి ఉందని, కానీ డెయిరీ యాజమాన్యం ఉన్న పాల ధరలను తగ్గించడం రైతు వ్యతిరేక చర్య అన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకొని ఆవుపాలధరను పునరుద్ధరించి రైతులకు న్యాయాలని డిమాండ్ చేశారు. డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద తలపెట్టిన మహాధర్నాకు పాడి రైతులంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాడి రైతులు రెడ్డి తవిటినాయుడు, పెంట సన్యాసినాయుడు, పెంట దామోదర్, పెంట రాము తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనంలో విధులు... భయం గుప్పెట్లో సిబ్బంది

- శ్లాబ్ పెచ్చులూడుతున్న వైనం
- పునాదులకే పరిమితమైన కొత్త భవనాలు
- ఇదీ నడుకూరు గ్రామ సచివాలయ దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. కాలం చెల్లకు ముందే ఈ భవనం పాడైపోయిందంటే గుత్తేదారులకు ఇచ్చిన కాసులకు అధికారుల కక్కుర్తి పడి పనులు చేపట్టినప్పుడు పర్యవేక్షణ లేకపోవడమేనన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేట దూరంలో గల నడుకూరు గ్రామ సచివాలయ భవనం నిర్మించి దశబ్దకాలం పైబడి కావస్తున్నప్పటికీ అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు శ్లాబ్ నుంచి వర్షపు నీరు కిందికి జారుకోవడంతో అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులూడి కిందకు పడుతున్నాయి. దీంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రాణాలు గుప్పెట్లు పెట్టుకొని కాలం వెలదీస్తున్నారు. ప్రత్యామ్నాయ భవనం లేకపోవడంతో శిథిల భవనంలోనే విధులు నిర్వహించాల్సి పరిస్థితి ఏర్పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు పైనుంచి కిందకు జారడంతో విలువైన సామాగ్రి పాడవుతుందేమోనని కంప్యూటర్, తదితర సామాగ్రి పైన బ్యానర్ కప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఉద్యోగులు అంటున్నారు.

పునాదులుగా పరిమితమైన నూతన భవనాలు

వైసిపి హయాంలో ప్రజలకు గ్రామస్థాయిలోనే సచివాలయం ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో గ్రామంలో సచివాలయం భవనంతో పాటు రైతు సేవా కేంద్రం వంటివి నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. అయితే గుత్తేదారుల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం వల్ల భవనం పనులు పునాదులకే పరిమితం కావడంతో సచివాలయ ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. ప్రస్తుతం శిథిలమైన భవనంలోనే రైతు సేవా కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. దశబ్ద కాలం కట్టిన భవనం ఇరుగ్గా ఉన్నందున అందులోనే రైతు సేవా కేంద్ర నిర్వహించడంతో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా సచివాలయం భవనం నిర్మాణ పనులు ప్రారంభించక ముందు కంప్యూటర్ పరికరాలతో పాటు టేబుళ్లు, కుర్చీలు, ఇతర సామగ్రి ఎక్కువగా ఉండడంతో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై ఉన్న స్థాయి అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగిలోకి తీసుకురావాలని ఉద్యోగులతో పాటు స్థానికులు కోరుతున్నారు.




పునాదులకే పరిమితమైన కొత్త సచివాలయ భవనం

వృథాగా సామూహిక మరుగుదొడ్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరుబయట మల విసర్జనకు స్వస్తి పలకాలని గతంలో టిడిపి ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంలోనే మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు స్థలం లేకపోతే లక్షలాది రూపాయలు వెచ్చించి సామూహిక మరుగుదొడ్లు నిర్మించేందుకు గుత్తేదారు ద్వారా పనులు చేపట్టారు. మండల కేంద్రంలోని జనవీధి, సాకలి వీధితో పాటు ఆడారు, పనస నందివాడ, బిటివాడ తదితర గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను గుత్తేదారులు చేపట్టారు. అప్పట్లో పనులు పూర్తికాక పోయినప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో గుత్తేదారులకు బిల్లులు చెల్లించారు. జన వీధిలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ఏ విధంగా ఉన్నాయో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు. సాకలి వీధిలో కూడా మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటికి మోటర్ సదుపాయం ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా పంచముఖ ఆంజనేయ ఆలయ సమీపంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సుమారు రూ.4లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించారు. రెల్లి వీధి సమీపంలో కూడా లక్షలాది రూపాయలతో మరుగుదొడ్లు నిర్మించేందుకు పిల్లర్లు, శ్లాబ్ వేశారు. అది శ్లాబ్‌కే పరిమితమైంది తప్ప పనులు పూర్తయ్యేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మించిన మరుగుదొడ్లు అధికారుల అలసత్వం వృథాగా పడిఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ వద్ద ప్రస్తావించగా, సాకలి వీధిలో గల సామూహిక మరుగుదొడ్లను పరిశీలించామని, వీటి వినియోగంపై ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తానని వివరణ ఇచ్చారు.



వీరఘట్టం జనవీధిలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు